మస్తు గిరాకీ

ఇతర రాష్ట్రాలకు సన్నవడ్ల ఎగుమతులు

- జిల్లాలో పండించిన ధాన్యానికి మంచి ధర
- అత్యధికంగా కేసముద్రం నుంచే తరలింపు..
- ఫలితంగా భగ్గుమంటున్న బియ్యం రేటు
- సన్నబియ్యం కొనలేని స్థితిలో సామాన్యులు
- ధరల నియంత్రణపై పట్టింపేది..?



కేసముద్రం మార్కెట్‌లో ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు లారీలో సన్నధాన్యం ఎగుమతి చేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 4 : సన్నరకం ధాన్యానికి భారీగా డిమాండ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల్లో ఆయా రకాల వడ్లు తక్కువగా పండటంతో.. జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ ప్రాంతాల్లో అమ్మకానికి వచ్చిన సరుకుకు గిరాకీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల నుంచి లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు సన్నధాన్యం తరలిస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రాంతంలో భారీ తుపాన్‌లు రావడంతో పాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద వరిసాగు చేయకపోవడంతో పాటు ఆంధ్ర, ఇతర ప్రాంతాల్లో సన్నధాన్యం లేకపోవడంతో ఇక్కడి వాటికి డిమాండ్ ఏర్పడింది. సన్నవడ్లు ఆంధ్రప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోండడంతో ధరలు పెరిగి, జిల్లాలో సన్న బియ్యం రేట్లు జిల్లాలో భగ్గుమంటున్నాయి. అధిక ధరల పెరుగుదలతో సామాన్యులు సన్నబియ్యం కొనుగోలు చేసే పరిస్థితుల్లో లేరు.

మార్కెట్లకు పెరిగిన ధాన్యం రాబడులు..

ఇతర రాష్ట్రాలకు సన్న ధాన్యం ఎగుమతి అవుతోండడంతో ధాన్యం ధరలు పెరుగుతున్నాయి. కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లలో ఈ సీజన్‌లో భారీగా వడ్ల రాబడులు కొనసాగుతున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఎకరంలో ధాన్యం 23 నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి అత్యధికంగా వచ్చింది. ఈ దిగుబడితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వడ్లు కూడా మార్కెట్లకు తరలివస్తున్నాయి. మానుకోట మార్కెట్‌కు ఈ సీజన్‌లో గత వారంలో 15 వేల బస్తాలకు పైగా రాబడులు కొనసాగగా, కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 40 వేల బస్తాల వరకు వచ్చాయి. వ్యవసాయ మార్కెట్లలో ఈ వడ్ల కాంటాలు అయిపోయే వరకు రెండు, మూడ్రోజుల సమయం పట్టేది. జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ లాంటి సన్నరకాలకు భారీగా ధరలు పెరిగాయి. జైశ్రీరాం రకం ధాన్యానికి రూ.3,130 నుంచి రూ.3,409 వరకు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ రకాలు కూడా రూ.3,130 నుంచి రూ.3,359 వరకు ధరలు పెరిగాయి. ఈ ఏడాది సన్నరకాలకు క్వింటాపై రూ.3 వేలకు పైగానే ధరలు పలకడం గమనార్హం.



కేసముద్రం మార్కెట్‌లో కాంటాలు అవుతున్న దృశ్యం

ఇతర రాష్ట్రాలకు..

నాగర్జునసాగర్ ఆయకట్టు కింద పండించిన సన్న ధాన్యం ద్వారా తయారైన బియ్యం హైదరాబాద్ మహానగరం ప్రజలకు సరఫరా అయ్యేవి. అలాంటిది నాగార్జునసాగర్‌లో నీటినిల్వలు తగ్గిపోవడంతో ఆయకట్టు కింద వరిసాగు చేయకపోవడంతో సన్నరకం వడ్ల సంక్షోభం ఏర్పడింది. దాంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు రంగంలోకి దిగి కేసముద్రం మార్కెట్‌పై దృష్టి పెట్టారు. కమీషన్ ద్వారా సన్నరకం ధాన్యం ఖరీదు చేయడానికి నడుం బిగించారు. మహబూబాబాద్ మార్కెట్‌లో కూడా ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నారు. కేసముద్రం మార్కెట్‌లో గత కొద్దిరోజుల నుంచి ప్రతీరోజు 20-30 లారీలకు పైగానే సన్నధాన్యం నేరుగా ఎగుమతులు చేశారంటే సన్నరకం ధాన్యానికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి నల్గొండ జిల్లా కాకినాడ, మండపేట ప్రాంతాలతో పాటు చెన్నై, నాగ్‌పూర్ ప్రాంతాల్లో ఎగుమతి చేశారు. కొంత సన్నరకం వడ్లను ప్రజలు అవసరాల కోసం ఉంచుకున్నారు.

బియ్యం ధరలు హైక్..

సన్నరకం ధాన్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న కారణంగా బియ్యం ధరలు మండిపోతున్నాయి. పాత బియ్యం మాట అటుఉంచి కొత్తవి కొనడానికి సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. జైశ్రీరాం బియ్యం కొత్తవి క్వింటాకు రూ.5,500లకు అమ్ముతుండగా, సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల వరకు ఉన్న పాత బియ్యం రూ.7.200 నుంచి రూ.7.600 వరకు విక్రయిస్తున్నారు. ఇదే బియ్యం గతేడాది రూ.6.400 నుంచి రూ.6.600 వరకు ఉంది. ఆర్ఎన్ఆర్ బియ్యం కొత్తవి రూ.4,500 నుంచి రూ.4,700 వరకు, పాత బియ్యం రూ.6,600 అమ్ముతున్నారు. గతేడాది కొత్త బియ్యం రూ.4,200 వరకే దొరకగా పాత బియ్యం రూ.5,600 వరకు విక్రయించారు. హెచ్ఎంటీ రకం (కొత్తవి) కూడా రూ.4,400 నుంచి రూ.4,600 పలుకుతుండగా గతేడాది రూ.4200 వరకు విక్రయించారు. దీంతో బియ్యం ధరల పెరుగుదలతో సామాన్యులు పరేషాన్ అవుతున్నారు. నిజానికి 50 కిలోల బస్తాల్లో బియ్యం విక్రయించిన ప్రభుత్వానికి ఎలాంటి జీఎస్టీ కట్టనవసరం లేదు. అయితే 25 కిలోలను ప్యాకింగ్ చేసి అమ్మితే మాత్రం 5 శాతం కమర్షియల్ ట్యాక్స్ (జీఎస్టీ) కట్టాలి.

కేసముద్రంలో మాత్రం అలాంటివి లేకుండానే 25 కిలోల ప్యాకింగ్ బస్తాలతో ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు విక్రయిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న బియ్యం ధరలను తగ్గించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'ప్రజాపాలన'తోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



నేరడలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న రాంచంద్రునాయక్

కురవి, జనవరి 4 : ప్రజాపాలనతో నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఈ పథకాలు అందించేందుకే సర్కార్ దరఖాస్తులు స్వీకరిస్తోందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. నేరడలో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తుందన్నారు. వంద రోజుల్లోపు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, కొర్ని రవీందర్‌రెడ్డి, ఎస్కే నజీర్, మదూరి రఘు, చందునాగన్న పాల్గొన్నారు. కాగా, నూదనపల్లి, అయ్యగారిపల్లి, కందికొండలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఎంపీడీవో సరస్వతి, ఏవో మంజుఖాన్ పాల్గొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తాం

మరిపెడ : విద్య, ఉపాధి అవకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి మెరుగుపరుస్తారని ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆయనను మరిపెడ విశ్రాంతి భవనంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. విద్య, ఉపాధి అవకాశాలపై ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్య, ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయని, కేసీఆర్ నియంతృత్వ పోకడవల్ల అనేకమంది నిరుద్యోగులు ఆత్మక్షోభకు గురయ్యారని గుర్తు చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి, వెంటనే 2లక్షల ఖాళీలను భర్తీ చేయడానికి సీఎం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మరిపెడలో శ్రీదుర ఫిజియోథెరపీ సెంటర్‌ను ప్రారంభించారు. మరిపెడ హెల్త్‌హబ్‌గా తీర్చిదిద్దడానికి డాక్టర్‌గా తనవంతు కృషి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, అంబరీష, రఘువీర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, పిల్లి రవీందర్‌రెడ్డి, గుండగాని వెంకన్న, ఖలీల్, ఖాదర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 : మునిసిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మానుకోట మునిసిపల్ కార్యాలయంలో గురువారం పెండింగ్ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని అభివృద్ధి పనులపై దృష్టి సారించి, పర్యవేక్షిస్తూ త్వరతిగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం 25, 33వ వార్డులో ప్రజాపాలనలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, సీడీపీవో లిల్లిడెబోరా, మెప్మా డీఎంసీ విజయ, వార్డు కౌన్సిలర్లు షేక్. ఫరీదా ఖలీల్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దండె శ్రీహరి పాల్గొన్నారు.

8న జడ్పీ సర్వసభ్య సమావేశం

మహబూబాబాద్ రూరల్, జనవరి 4 : జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్‌కు రూ.25 లక్షల మంజూరు



హైదరాబాద్‌లో మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్‌కు రూ.25 లక్షల మంజూరు లేఖను ఇస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేసముద్రం, జనవరి 4 : మండలంలో మున్నూరుకాపు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల్లోంచి రూ.25లక్షలను మంజూరు చేసినట్లు ఆ కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం మంజూరు లేఖను ఎంపీ అందజేసినట్లు చెప్పారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, కోశాధికారి సింగంశెట్టి ఏకాంతం (చంటి), కముటం శ్రీనివాస్, రావుల మురళి పాల్గొన్నారు.

'దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి'



కేసముద్రంలో ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

కేసముద్రం, జనవరి4 : కేసముద్రం స్టేషన్‌లో కొన్ని నెలలుగా తరచూ దొంగతనాలు జరుగుతోండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గురువారం స్థానిక ఎస్ఐ వంశీధర్ ఆధ్వర్యంలో ఆటోద్వారా ప్రచా రం నిర్వహించారు. ఇంటి ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరికి వెళ్లితే విలువైన వస్తువులను సురక్షితమైన చోట భద్రపర్చుకోవాలన్నారు. దొంగతనాలకు సంబంధించిన సమాచారం ఏవైనా ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో ప్యానెల్ టీం తనిఖీలు



గూడూరు ఆశ్రమ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ప్యానెల్ టీం అధికారి

గూడూరు, జనవరి 4 : మండల కేంద్రం శివారు చంద్రుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్యానెల్ టీం ప్రతినిధులు గురువారం తనిఖీలు చేపట్టారు. తొలుత ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సబ్జెక్టు వారీగా బోధన పద్ధతులపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈరాసింగ్, రమణ, హరినాథ్, భద్రులాల్, పాపయ్య హెచ్ఎం సాయిబాబా, వార్డెన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

మహాజాతరలో మెరుగైన వైద్య సేవలందించాలి

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

ములుగు కలెక్టరేట్, జనవరి 4 : ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. ములుగు కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం మహాజాతరలో వైద్యా ఆరోగ్య శాఖ నిర్వర్తించే బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. జాతరలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అధికారుల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. డీఎంహెచ్‌వో, జాతర నోడల్ అధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ మేడారం మహాజాతరలో విధులు నిర్వర్తించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యాధికారుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. వివిధ జిల్లాల్లో పనిచేసే వైద్యాధికారులు సైతం జాతర సమయంలో ప్రత్యేక వైద్య సేవలు అందించేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. గతంలో జరిగిన జాతరలను దృష్టిలో పెట్టుకుని తొమ్మిది విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. 2022లో జరిగిన జాతరలో రెండు లక్షల మంది భక్తులకుపైగా ఓపీ సేవలు అందించామన్నారు. ఈసారి జరిగే జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. ఈసమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు సాంబశివరావు, ప్రశాంత్, రమణ, మధుసూదన్, శిరీష, అంబరీష్, ములుగు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- 11న మానుకోటలో మహాధర్నా
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మహబూబాబాద్‌టౌన్, జనవరి 4 : అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించి, అందులో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం పట్టణ విస్తృతస్థాయి సమావేశాన్ని కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోటలోని కురవి గేట్ సమీపంలో సర్వే నెంబర్ 255/1 ప్రభుత్వ భూమిలో గత సంవత్సరం సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. ఆ భూమిని ఆక్రమించుకున్న భూకబ్జాదారులు అధికారులతో కలిసి పేదల గుడిసెలను 19సార్లు జేసీబీలతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వారికి అండగా నిలిచిన సీపీఎం నాయకులపై అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. సీపీఎం పోరాట ఫలితంగానే భూ కబ్జాదారులు ఆక్రమించిన భూమి వెలుగులోకి వచ్చిందని తెలిపారు. పేదల జోలికి వెళ్లిన ప్రభుత్వాలు ఎక్కడా మనుగడ సాధించిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. సర్వే నెంబరు 255/1లో పేదలు వేసుకున్న గుడిసెలకు జీవో నెంబరు 58 ద్వారా ఇళ్ల పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని డిమాండ్‌చేశారు. ఈనెల 11వ తేదీన మానుకోట జిల్లా కేంద్రంలో ఇంటి స్థలాలు, పట్టాలివ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపడుతున్నామని, నిరుపేదలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సూర్నపు సోమయ్య, చీపిరి యాకయ్య, బానోత్ వెంకన్న, తోట శ్రీనివాస్, యమగాని వెంకన్న, బూర్గుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కళాకారులను విస్మరించొద్దు

నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశం



మాట్లాడుతున్న అనువోజు వెంకటేశం

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 : తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో గొంగడి వేసి, కాలికిగజ్జె కట్టి కీలకపాత్ర పోషించిన కళాకారులను విస్మరించకుండా, వారిని ఆదుకోవాలని నిరుద్యోగ ఉద్యమకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనువోజు వెంకటేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డాక మాజీ సీఎం కేసీఆర్ 550 మంది కళాకారులకు సాంస్కృతిక సారథులు (ఉద్యోగులు)గా అవకాశం కల్పించి, చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఉద్యమానికి సంబంధంలేని, ఆటపాటరాని వ్యక్తులకు ఉద్యోగాలిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగాలపై గత ప్రభుత్వంపై కోర్టులో కేసువేసి ఈ నియామకాలను రద్దుచేస్తే మళ్లీ తూతూ మంత్రంగా నోటిఫికేషన్ వేసి, పాత కళాకారులకే ఉద్యోగాలివ్వడం జరిగిందని విమర్శించారు. ఈ విషయంపై పలుమార్లు ధర్నాలు చేసినప్పటికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి, కళాకారులందరికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పి.శ్రీనివాస్, రమేష్, పాండురంగాచారి, వేణు, యాకయ్య రవీందర్, హరిత పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో రూ.7.69 లక్షల అవినీతి

- బాధ్యుల నుంచి రికవరీ చేయాలి
- డీఆర్‌డీఏ ఏపీడీ శాంతకుమారి ఆదేశం
- చిన్నగూడూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికవరీ వివరాలను తెలుపుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ శాంతకుమారి

చిన్నగూడూరు, జనవరి 4 : మండలంలో 2020 నవంబర్ 1 తేదీ నుంచి 2023 మార్చి వరకు నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌లో భాగంగా అవినీతి పరుల నుంచి రూ.7.69 లక్షలు రికవరీ చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ శాంతకుమారి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ బృందాలు ఐదు రోజులుగా ఊరురా డోరు టు డోర్ తనిఖీలు జరిపి, ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గురువారం మండల పరిషత్ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి, అవినీతి అక్రమాలు బయట పెట్టారు. డీఆర్‌డీఏ ఏపీడీ సంబంధిత ఫెనాల్టీలు రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. బాధ్యుల నుంచి రూ.7.69 లక్షలు రికవరీ చేయాలని ఎంపీడీవో శ్యాంసుం దర్‌ను ఆదేశించారు. చిన్నగూడూరు రూ.1,86,562, గుండంరాజుపల్లి రూ.81,812, జయ్యారం రూ.56,896, మంగోలిగూడెం రూ.31,622, మన్నెగూడెం రూ.23,866, మెగ్యాతండా రూ.5,045, పగిడిపల్లి రూ.27,029, తుమ్మల చెరువుతండా రూ.2,914, ఉగ్గంపల్లి రూ.1,27,106, విస్సంపల్లి రూ.2,27,063 పూర్తి మొత్తంలో అవినీతి జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదామ్, ఎంపీపీ పద్మ, మండల ఈజీఎస్ సిబ్బంది, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

తొర్రూరు, జనవరి 4 : విద్య ఉపాధ్యాయ రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ తొర్రూరు మండల అధ్యక్షుడు కొలుపుల శ్రీనివాస్ అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, లక్ష్మీనారాయణ, రాజ సుకన్య జ్యోతి, రాణి, మాధవి, సంపత్, ఉప్పలయ్య, రమేష్ ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

విద్యా సదస్సును సక్సెస్ చేయాలి

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, నేటి ఆధునిక కాలంలో విద్యకు పెరుగుతున్న ప్రాముఖ్యత తదితర అంశాలపై నిర్వహించే విద్యాసదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాసదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో పాల్గొనేందుకు రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్, విశ్రాంత ఐఏఎస్‌అధికారి ఆకునూరి మురళి లాంటి వక్తలు హాజరై ప్రసంగిస్తారని, డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు, మేధావులు, తెలంగాణవాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ఐలయ్య, రవీందర్, శ్రీనివాస్, వేణుగోపాల్, క్రాంతి, జనార్దన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

కూచిపూడి నృత్యంలో సమీక్షారెడ్డికి అవార్డు

సుబేదారి, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన 13వ కృష్ణ రంగ్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన కె.సమీక్షారెడ్డి ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. సమీక్షారెడ్డి ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. సమీక్షారెడ్డిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.


7న మడికొండలో రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం

కాజీపేట జంక్షన్, జనవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, డెయిరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. విశిష్ట అతిథిగా పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గల సుమారు 3వేల మంది సభ్యులు ఉన్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సంక్షేమ సంఘం ఆదాయం, ఖర్చులు పరిశీలించి, ఇంకా ముందు రెడ్డి కులస్తుల కోసం చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. రెడ్డి బంధువులందరు సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.
















బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా..

● కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం ● ఇప్పటివరకు 2,283 మందికి విముక్తి



హనుమకొండ రూరల్, జనవరి 4: వెట్టిచాకిరిలో మగ్గుతున్న చిన్నారులు, అనాథ, వీధి బాలలకు విముక్తి కల్పించి వారికి రక్షణ కల్పించేందుకు యేటా జనవరి మాసంలో ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను చేపడుతోంది. బాలల హక్కుల పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా హనుమకొండ జిల్లాలో 2015 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బావిభారత పౌరులైన బాలలు బడిలో చదువుకో వాల్సిన సమయంలో కార్మికులుగా మారి భవిష్య త్‌ను అంధకారం చేసుకుంటున్నారని భావించిన ప్రభుత్వం.. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. యేటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తూ బడికి పంపే ఏర్పాట్లు చేస్తుంది. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు 2,283 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, పేదరికం కారణంగా పలువురు తమ పిల్లలను పనులకు పంపుతుంటారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేడమే లక్ష్యంగా అధికారులు యేటా రెండు దపాలుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసులు, కార్మికశాఖ, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేస్తారు.

బాధ్యులపై కేసుల నమోదు

ఈ బృందాలు నెలరోజులపాటు వాహనాల గ్యారేజీలు, హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారు. గుర్తించిన వారిలో 14ఏళ్లలోపు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తు ంటే బాధ్యులపై కార్మికశాఖ కేసులు నమోదు చేస్తుంది. హానికరమైన పనులలో 15-18 యేళ్ల వయస్సున్న వారుంటే కేసులు నమోదు చేస్తారు. గుర్తించిన బాలకార్మికులు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగిస్తారు. ఒకవే ళ అనాథలుంటే వారిని ఆశ్రమాలకు తరలించి పాఠశాలల్లో చేర్పిస్తారు. బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తారు. అదృశ్యమైన పిల్లల వివరాలను దర్పణ్ పోర్టల్‌లో నమోదు చేసి, అనంతరం చర్యలకు శ్రీకారం చూడతారు. యాం టీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సహకారంతో అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించేం దుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తామరు. తప్పిపో యిన చిన్నారులు, దుర్భర జీవితం గడుపుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు, ప్రభుత్వ, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు.

గుర్తించిన బాలకార్మికుల వివరాలు ఇవే..

ఇయర్	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం
2015	108	178	286
2016	152	172	324
2017	177	110	287
2018	103	113	216
2019	68	211	279
2020	168	–	168
2021	178	228	406
2022	112	95	207
2023	63	47	110

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్



14 ఏళ్లలోపు వయస్సున్న బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం నేరం. అలా ఎవరైనా బాల, బాలికలను పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మారిస్తే సంబంధిత యజమానిపై కేసులు నమోదు చేస్తాం. మైనర్లను ఎట్టిపరిస్థితుల్లో పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా బాలకార్మికులను గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

సంతోష్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల తో తమ పిల్లలను పని చేర్పిస్తున్నారు. వ్యాపారులు పిల్లల కు తక్కువ జీతాలు ఇచ్చి పనిలో పెట్టుకుంటున్నారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు ఉన్నట్లయితే 1098కు సమాచారం అందించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం.

ఎమ్మెస్పీతోనే సామాజిక, రాజకీయ న్యాయం

ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

హసన్‌పర్తి, జనవరి 4: మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ)తోనే సామాజిక రాజకీయ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెస్పీ పేదల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని పార్టీలు అగ్రకుల పార్టీలేనని, వాటి ద్వారా న్యాయం జరుగదన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మహజనులతో కలిసి మహజన రాష్ట్రాన్ని స్థాపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, నాయకులు రాజారపు భిక్షపతి, ఆరెపెల్లి పవన్, రాజారపు కిరణ్, ఆకారపు రాజు, బొక్క సాంబరాజు, కుక్కమూడి మొగిళి, నమీండ్ల సూర్యం, మేకల రమేశ్, మేకల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో ఎమ్మెస్పీ జెండావిష్కరిస్తున్న నాయకులు

లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ టౌన్, జనవరి 4: హనుమకొండ జిల్లా పరిషత్ హాల్‌లో తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలి 215వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ రాజీవ్ శుక్లా, హనుమకొండ, వరంగల్ డీడబ్ల్యూవోలు మధురిత, శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, ప్రమోద హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా 2024 బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించారు. బ్రెయిలి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జి.శ్రీను, అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.రవిందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కార్తిక్, సంయుక్త కార్యదర్శి కమల, సలహాదారులు విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న తాళ్ల మల్లేశం

కాజీపేట, జనవరి 4: ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులకు కాంస్య పతకాలు లభించాయి. పతకాలు లభించిన వారిలో ఏడో తరగతి చదువుతున్న అయాన్ నాయక్, తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిచరణ్ ఉన్నారు. వీరిని గురువారం తాళ్ల పద్మావతి పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.


రెండు రోజులు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండసిటీ), జనవరి 4: ధర్మసాగర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు అమ్మవారిపేట వద్ద ఏర్పడిన లీకేజీ కారణంగా వరంగల్ పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరా ఉండదని ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలావరంగల్, తూర్పు, మధ్య కోట, ఎస్‌ఆర్ఆర్ తోట, యూనీ రెడ్డినగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

డిగ్రీ ఈ-కామర్స్ ప్రశ్నపత్రంలో రెండుసార్లు ఒకే ప్రశ్న

ఆందోళనకు గురైన ఫైనల్ ఇయర్ విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం జరిగిన బీకాం ఫైనల్ ఇయర్ 5వ సెమిస్టర్‌లోని ఈ-కామర్స్ పరీక్ష పత్రంలో ఒకేప్రశ్న రెండుసార్లు వచ్చింది. దీంతో ఆ సబ్జెక్ట్ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వర్సిటీ పరిధిలో డిసెంబరు 20వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొ దటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడోసెమ్, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐదోసెమ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అందు లో భాగంగా గురువారం డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు జరుగుతున్న ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ ప్రశ్నాపత్రం సెక్షన్-ఏలో 8 ప్రశ్నలకు గాను ఐదు ప్రశ్నలకు సమధానాలు రాయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్న కు మూడు మార్కుల చొప్పున ఐదు ప్రశ్నలకు 15 మార్కులు కేటాయించారు. కాగా, ప్రశ్నాపత్రంలోని 1లో ఏ నుంచి హెచ్ వరకు 8 ప్రశ్నలుండగా అందు లో బీ,హెచ్ ప్రశ్నలు (వాట్ ఈజ్ సెర్చ్ ఇంజన్) ఒకేలా ఉన్నాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. 8 ప్రశ్నలకు గాను ఐదింటికి సమాధానాలు రాయాల్సి ఉండగా మూడు ప్రశ్నలు చాయిస్ కింద పోతాయి. అయితే ఈ కామర్స్ ప్ర శ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేలా ఉండడంతో ఒక్కచాన్స్ కోల్పోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారు చేసిన అ ధికారులు ఈ తప్పిదాన్ని గుర్తించకపోవడంతో తమకు అన్యాయం జరిగిందని వారు వాపోతున్నారు.



కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ రెండుసార్లు వచ్చిన ఒకేప్రశ్న

జనగామలో కేయూ పరీక్షా కేంద్రాల తనిఖీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను గురువారం జనగామలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మ ల్లారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య బృందం తనిఖీలు నిర్వహి ంచింది. జనగామలోని ఏకశిల డిగ్రీ, పీజీ కళాశా లలు, ఆర్ఆర్ఎం, రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేశారు. అలాగే గురువారం వరంగల్ నగరంలో ఏఎస్ఎం డిగ్రీ పీజీ కళాశాల కేంద్రాన్ని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిల్తో ఎఎస్ ఇతర అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎఎం కళాశాలలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను పట్టుకుని ముగ్గురిని డీబార్ చేసినట్లు డాక్టర్ తిరుమదేవి వెల్లడించారు. పరీక్షల ప్రశాంతంగా నిర్వహించాలని సంబం ధిత అధికారులకు చూచించారు.



పరీక్షల కేంద్రాలను తనిఖీ చేస్తున్న పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, బన్న అయిలయ్య

కేయూ డిగ్రీ పరీక్షల్లో 36 మంది డీబార్

కాకతీయ యూనివర్సిటీ గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు గురువారం వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 16 మంది, వరంగల్‌లో 14 మంది, ఖమ్మంలో 6 మంది డీబారైనట్లు తెలిపారు. పరీక్షల నిబంధనల మేరకు వీరిపై చర్యలు చేపడుతామని వెల్లడించారు.

ఎవరికీ పట్టని 'కాజీపేట'

సమస్యల వలయంలో జంక్షన్ ● విస్తరణకు నోచుకోని చౌరస్తా ● ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ ● ప్రతిపాదనలకే పరిమితమైన ఆస్పత్రి ● ఊసేలేని బస్టాండ్ నిర్మాణం



విస్తరణకు నోచుకోని కాజీపేట చౌరస్తా



అసంపూర్తిగా నిర్మించిన ఆర్వోబీ

కాజీపేట, జనవరి 4: హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి.. రైల్వే పరంగా నిత్యం 150 రైళ్ల రాకపోకలు.. రోజూ వేలాది మంది ప్రయాణాలతో నిత్యం రద్దీగా ఉండే ట్రైసిటీలో భాగమైన కాజీపేట జంక్షన్ సమస్యలకు నిలయంగా మారింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎందరు పాలకులు మారినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. కాజీపేట మాత్రం అభివృద్ధిలో ఆమడ దూరంలోనే ఉంటోంది. ప్రతీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కాజీపేట అభివృద్ధిపై హామీలు ఇస్తూ ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ ఊసే మరిపోతున్నారు. ఇది యాభై ఏళ్లుగా జరుగుతున్న తతంగమే.. ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్న వారిని విమర్శిస్తూ మళ్లీ వారు అధికారంలో రాగానే అదే తంతు కొనసాగిస్తున్నారు.

ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ

కాజీపేట ఫాతిమానగర్‌లో అదనంగా నిర్మించడానికి తలపెట్టిన ఆర్వోబీ నిర్మాణం ఐదేళ్ల కిందట ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తికాలేదు. అక్కడే ఉన్న పాత బ్రిడ్జిని 50 యేళ్ల కిందట అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి అక్కడక్కడా పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందో నని ప్రయాణికులు భయం, భయంగా ప్రయాణించే పరిస్థితి నెలకొంది. పైగా హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి ఇది ఒక్కటే. హైదరాబాద్ నుంచి వరంగల్ వచ్చే ప్రజాప్రతినిధులు ఇదే బ్రిడ్జిగుండా ప్రయాణిస్తుంటారు. ఇక ఉదయం సమయాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వివిధ పనులకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే గంటలకొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొత్త బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విస్తరణకు నోచుకోని చౌరస్తా..

ట్రైసిటీలో చౌరస్తాలన్నీ దాదాపు విస్తరించారు. కొన్ని మోడల్ జంక్షన్‌లుగా రూపుదిద్దారు. కాజీపేట - వరంగల్ ప్రధాన రహదారి కాజీపేట చౌరస్తాను మాత్రం ఇప్పటికీ విస్తరించలేదు. సాయంత్రం అయ్యిందంటే నిత్యం రద్దీగా ఉండి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ చౌరస్తా చూస్తేనే ఏదో గజిబిజి ప్రాంతంగా ఉంటోంది.. చౌరస్తా మధ్యలో వాటర్ ఫౌంటేన్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ ఊసే మరిచారు.

వంద పడకల ఆస్పత్రికి సుస్తీ

కాజీపేటలో వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి సుస్తి చేసింది. పదేళ్ల కిందట కాజీపేట మినీ మునిసిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గదుల నిర్మాణం, ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు నిర్మించినప్పటికీ అది ఇప్పటికీ పూర్తికాలేదు. సాక్షాత్తూ నాటి ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి కాజీపేటలో మినీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి హామీ ఇచ్చినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాజీపేట, పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనా, గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం హనుమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే.

బస్టాండ్ ఊసేలేదు..

కాజీపేటలో ఇప్పటికీ బస్టాండ్ లేదు. రోడ్డుపైన ఒక చిన్న రేకుల షెడ్డులోనే బస్టాండ్‌ను నడిపిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బస్సుల ద్వారా వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇక నరకమే. ఎండాకాలం వస్తే ఎండకు, వర్షాకాలం వస్తే వర్షానికి ప్రజలు తడుచుకుంటూ బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముప్ఫై ఏళ్లుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని నాటి మంత్రి దాస్యంప్రణయ భాస్కర్ ఎన్నో ఉద్యమాలు చేశారు. చౌరస్తా సమీపంలో ఆర్టీసీ సుమారు 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించి హద్దులు కూడా వేశారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలానికి మార్కెట్ రేటు కట్టివ్వకపోవడంతో అది రద్దయ్యిందని స్థానికులు తెలుపుతుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం ఊసే లేదు. ప్రతి ఎన్నికల్లో కాజీపేటను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పే నాయకులు ఈసారైనా కాజీపేట అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ములుగు ఏజెన్సీలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయిన ముఖ్యంగా ములుగు ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, వెంకటాపురం(నూగురు), తాడ్వాయిలోని పలు ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 16డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. పగటి పూట సగటున 31 డిగ్రీలుగా ఉంటోంది. చలికి తోడు తెల్లవారుజాము నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు ఈ ప్రభావం ఉంటోంది. శ్వాసకోస వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు.భూపాలపల్లి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి సమయంలో చలి తీవ్రమవుతోంది. జిల్లాలో గురువారం గరిష్ఠంగా 30 డిగ్రీలు, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లాలో గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు తీవ్రగా కమ్ముకొని ఉంటుంది. సాయంత్రం 4 గంటలకే చలి ప్రారంభం అవుతోంది. నాలుగు రోజులుగా చలి తీవ్రత ఈ విధంగా నమోదు అయింది. సోమవారం (ఉష్ణోగ్రత 28.9- 15.5), మంగళవారం (ఉష్ణోగ్రత 29.1- 16.8), బుధవారం (28.7- 17.0), గురువారం (29.4- 15.8)గా నమోదు అయింది.

జనగామలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

చలి కాలం కావడంతో జనగామ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా చిల్పూరు మండలంలోని మల్కాపూర్‌లో 15.5 డిగ్రీలు, పాలకుర్తి మండల కేంద్రంలో 15.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. అత్యధికంగా దేవరుప్పుల మండలంలోని కోలుకొండ గ్రామంలో 18.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

టీఎన్‌జీవోస్ మెంబర్‌షిప్ పెంచాలి

టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్



మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ రూరల్, జనవరి 4: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషిచేస్తున్న ఏకైక సంఘం టీఎన్‌జీవోస్ యూనియన్ మాత్రమేనని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. గురువారం హనుమకొండలో టీఎన్‌జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం కార్యవర్గ సమావేశం ఫోరం అధ్యక్షుడు కలకోట్ల భరత్ అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా ఉద్యోగ విధుల్లో చేరిన సభ్యులకు యూనియన్ మెంబర్‌షిప్ అందజేస్తామన్నారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, రాముునాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, మిస్బా, ఆనంద్‌బాబు, సతీష్‌చంద్ర, జైవీర్, అలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు

ఐనవోలు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన' సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ వేదికలపై ఆసీనులవుతుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రొటోకాల్ ప్రకారం సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులే స్టేజీపై కూర్చోవాలి. కానీ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరైన సందర్భాల్లో వేదికపైకి పిలవకపోయినా కొందరు మండల, జిల్లా నాయకులు నేరుగా వచ్చి కూర్చుంటున్నారు. గురువారం కక్కిరాలపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వేదికపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉండగానే, పలువురు నాయకులు వచ్చి కూర్చున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించగా, 'మేం పిలవకపోయినా వచ్చి కూర్చుంటున్నారు దానికి మేం ఏం చేయాలి..?' అంటూ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల పున్నేలులో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై విమర్శలు వచ్చాయి. ఐనవోలు జాతర సమీక్ష సమావేశంలోకి కొందరు నాయకులు ఇలాగే చొచ్చుకవస్తే మంత్రి కొండా సురేఖ వారించి, వారిని బయటకు పంపించారు. అయినప్పటికీ రోజూ ఏదో ఒక కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతూనే ఉందని పలువురు వాపోతున్నారు. ఇదిలావుండగా, ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇటు అధికారులు గానీ, అటు ప్రభుత్వ పీఏగాని ముందస్తుగా తెలుపడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభం

సుబేదారి, జనవరి 4: దివ్యాంగ పిల్లల కోసం బాలసముద్రంలో గురువారం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ మాస్టర్ ఆఫ్ ఆక్యుపెన్షనల్ థెరపిస్టు డాక్టర్ అంకు కుమార్, చైల్డ్ సైకాలజిస్టు డాక్టర్ లీనా మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో పుట్టిన పిల్లల నుంచి 15 యేళ్ల పిల్లల వరకు ఎదుగుదలలో ఎలాంటి లోపం ఉన్నా, మాటలు రాకపోయినా, చదువులో వెనుకబడిన పిల్లలకు నిపుణులైన డాక్టర్లతో చికిత్స చేయిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలకు ఇంకా అనేక రకాలైన లోపాలకు చికిత్స చేస్తామని, ఈ నెల 10వరకు ఉచితంగా చూస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జనవరి 4: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట దర్గాకు చెందిన దేవర వెంకటేశ్వర్లు (42) కూలిపని చేస్తూ మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దేవర శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దేవరాజు(ఫైల్)

కమలాపూర్, జనవరి 4 : కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మండ దేవరాజు(24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు, ఎస్ఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న యువకుడు స్వగ్రామం నుంచి అంబాల గ్రామ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు. కాగా, సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

వనదేవతల సన్నిధిలో వైద్య, విద్యుత్ ఉన్నతాధికారులు



వనదేవతలను దర్శించుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మేడారం, జనవరి 4: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌రెడ్డి గురువారం వేర్వేరుగా పర్యటించారు. వనదేతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహాజాతరకు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పరిశీలించారు. ఈసందర్భంగా హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ వనదేవతల మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మహాజాతరకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. వరద ముంపుతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ధ్వంసమైనప్పటికీ వెనువెంటనే మరమ్మతులు చేపట్టి నిరంతరం విద్యుత్ అందించేదిశగా పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. కోటి 50 లక్షలకు పైగా వచ్చే మేడారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. 230 ట్రాన్స్‌ఫార్మర్లు, తొమ్మిదిన్నర కిలోమీటర్ల విద్యుత్‌లైన్లు పూర్తిచేశామని అన్నారు. పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచామని అన్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, సీజీఎం మోహన్‌రావు, ఎస్ఈ మల్సూర్‌నాయక్, డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ స్వామిరెడ్డి, ఏడీ వేణుగోపాల్, ఏఈ వేణుకుమార్, ఇతర విభాగాల డీఈలు, ఏడీలు, ఏఈలు ఉన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

పాలకుర్తిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు

పాలకుర్తి, జనవరి 4 : పాలకుర్తి మండల కేంద్రంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి యవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన జట్లకు నగదుతో పాటు మెమోంటోలు అందచేస్తామని చెప్పారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాల్గవ బహుమతి రూ.8వేలు, ఐదవ బహుమ తి రూ.6వేలు, ఆరవ బహుమతి రూ.4వేల నగదును అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల జట్లు 8328004828, 9676428932, 995969 5365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళపై దాడి

హనుమకొండ క్రైం, జనవరి 4: షట్టర్ యజమాని మాట్లాడనివ్వలేదని మహిళపై ఇద్దరు దాడి చేసి షాపును ధ్వంసం చేసిన ఘటన హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురకు చెందిన వంగాల వాణిశ్రీ హనుమకొండ పోలీసు స్టేషన్ ముందు లైన్‌లో ఓ షట్టర్ అద్దెకు తీసుకుని లేడీస్ ఎంపోరియం నడిపిస్తోంది. షాపు ముందు ఉన్న గాదం స్వరూప, గాదం శృతిలు బుధవారం సాయంత్రం షాపునకు వచ్చి వాణిశ్రీతో గొడవకు దిగారు. తమతో చాలా రోజులుగా ఎందుకు మాట్లాడడం లేదని, ఇంటి యజమాని మాట్లాడవద్దని చెప్పడంతోనే తమతో మాట్లాడడం లేదని వాణిశ్రీపై ఇద్దరు గొడవకు దిగారు. వాణిశ్రీపై దాడి చేయడంతో పాటు షాపులో ఉన్న ఫర్నిచర్, సామగ్రిని ధ్వంసం చేశారు. తనపై దాడి చేయడంతో పాటు సుమారు రూ. 30 వేల విలువ గల సామగ్రిని ధ్వంసం చేసినట్టు పోలీసుకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం స్వరూప, శృతి పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరి అరెస్టు

మహాముత్తారం, జనవరి 4: అట్రాసిటీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గురువారం వెల్లడించారు. మహాముత్తారం మండలంలోని మాదారానికి చెందిన ఎం.డి.అలావుద్దీన్, షఫీయొద్దీన్ డిసెంబరు 30న మాదారంలో ఎన్నికల విధుల్లో ఉన్న స్థానిక అంగన్‌వాడీ టీచర్ బెల్లంకొండ భీమక్క వి.దులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెను కులంపేరుతో దూషించారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇదే ఘటనలో అంగన్‌వాడీ టీచర్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కూడా కేసునమోదు చేశామన్నారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank A Government of India Undertaking Together We Can

కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ

ఆంధ్రజ్యోతి ABN

ముగ్గుల పోటీలు జరిగే ప్రాంతాలు

హనుమకొండ జిల్లా
స్థలం : సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, చర్చి కాంపౌండ్, ఎన్జీవోస్ కాలనీ రోడ్, హనుమకొండ
తేది : జనవరి 7 (ఆదివారం)
ఫోన్ నంబర్లు : 98493 36896, 86868 69444

వరంగల్ జిల్లా
స్థలం : ఏవీవీ కళాశాల గ్రౌండ్, రామ్‌లక్ష్మణ్ టాకీస్ ఎదురుగా, వరంగల్
తేది : జనవరి 7 (ఆదివారం)
ఫోన్ నంబర్లు : 99894 17055, 93463 65984, 97057 52515

ములుగు జిల్లా
స్థలం : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, ములుగు
తేది : జనవరి 7 (ఆదివారం)
ఫోన్ నంబర్లు : 99854 11690, 8008 929 254

మహబూబాబాద్ జిల్లా
స్థలం : సమైక్య జూనియర్ కళాశాల, కంకరబోడ్ మహబూబాబాద్
తేది : జనవరి 7 (ఆదివారం)
ఫోన్ నంబర్లు : 99854 11691, 99854 11672

జనగామ జిల్లా
స్థలం : సెయింట్ పాల్స్ హైస్కూల్, నెహ్రూ పార్క్, జనగామ
తేది : జనవరి 7 (ఆదివారం)
ఫోన్ నంబర్లు : 92472 09344

భూపాలపల్లి జిల్లా
స్థలం : అంబేద్కర్ స్టేడియం, భూపాలపల్లి
తేది : జనవరి 6 (శనివారం)
ఫోన్ నంబర్లు : 9985 411 673, 9676 941 548

ముగ్గుల పోటీ నిబంధనలు
1. మహిళలు మాత్రమే పాల్గొనాలి.
2. ముగ్గు, రంగులు, పువ్వులు, ఇతరత్రా సామాగ్రి స్వయంగా తెచ్చుకోవాలి.
3. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
4. ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అనేవి చెప్పగలగాలి.
5. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు.
6. న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం
7. ముగ్గును చేతితోనే వేయాలి. గొట్టాలు, బద్దలు వంటి ఉపయోగించి వేయకూడదు. జల్లెడ మాత్రం ఉపయోగించవచ్చు.
8. ముగ్గుల్లో గొబ్బెమ్మల వంటివి అమర్చవచ్చు. ఇతరత్రా వస్తువులు ఎక్కువగా అమర్చకూడదు. ముగ్గుకు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులు వాడాలి తప్పితే ఆ వస్తువులనే ప్రధానాంశంగా చేసుకోకూడదు.

సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

మొదటి బహుమతి రూ.6000/-
రెండో బహుమతి రూ.4000/-
మూడో బహుమతి రూ.3000/-



Powered By




AIMS INSTITUTES Peenya, Bangalore

PROGRAMMES OFFERED
MBA | MBA In France | PGDM | BBA | BBA (Aviation)
BCOM | MCOM | MFA (Financial Analysis) | DIPLOMA Swiss Professional Diplomas in Hospitality (Culinary / Food & Beverage / Rooms service)
BCA | MCA | BHM
MSW | PUC (PCMB/PCMC/CEBA)

AIMS Institutes: 1st Cross, 1st Stage, Peenya, Bangalore
AIMS Admissions Centre +91 81500 01994
www.theaims.ac.in/apply admission@theaims.ac.in

Real Partner



SWARGASEEMA SUKETANA
DTCP APPROVED
TS RERA P014000006315
KONDURG @SHADNAGAR (HYDERABAD)
DTCP & RERA APPROVED PLOTS
Ph: 9849012500
CALL US FOR FREE SITE VISIT

'ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం'


పర్వతగిరిలో ప్రజల నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 4 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో రజాకారుల పాలన కొనసాగిందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విమర్శించారు. రెడ్యాలలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే పని చేసిందని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమాన్నిప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జమాండ్లపల్లి చెక్‌పోస్టు నుంచి రెడ్యాల క్రాస్‌రోడ్డు వరకు డబుల్ బీటీ రోడ్డు మంజూరుకు హామీ ఇచ్చారు. సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికి కూడా రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయలేకపోయిందని చెప్పారు. అనంతరం గ్రామపంచాయతీ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచులు పర్కాల వెంకన్న, ఇనుగుర్తి శ్యాం, ఇస్తారి, ఎంపీటీసీలు తోట యాకాంబ్రం, రాంచంద్రు, చింతల లలితసైదులు, జడ్పీ సీఈవో రమాదేవి, ఆర్డీవో ఆలివేలు, నోడల్ ఆఫీసర్ సూర్యనారాయణ, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో హరిప్రసాద్, సూపరిండెంట్ రాధిక, స్వసంగ్ శ్రీనివాస్, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొనుగోలు చేసినట్లుగా మాజీ సీఎం కేసీఆర్ కొనుగోలు చేశారని ఎమ్మెల్యే మురళీనాయక్ విమర్శించారు. పర్వతగిరిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ ఇనుగుర్తి శ్యాంకుమార్, ఎంపీటీసీ రాంచంద్రు, ఆర్డీవో ఆలివేలు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఏపీఎం తిలక్ పాల్గొన్నారు.

● కేసముద్రం : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రం మండలం అమినాపురం, కోరుకొండపల్లి, ధన్నసరి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. కోరుకొండపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పురం రాజమణి, నాగెల్లి జ్యోతి, కొండ్రెడ్డి శ్రీవాణి, ఎంపీటీసీలు అంబటి లక్ష్మి, ధరావత్ బాలు, సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, నోడల్ అధికారి సూర్యనారాయణ, డీఎస్పీ సత్యనారాయణ, సీడీపీవో దెబోరా, ఎంపీడీవో రవీందర్‌రావు, దామరకొండ ప్రవీణ్, ఆరుద్రపు శ్రీనివాస్, పోకల శ్రీనివాస్, మేడి ఉపేందర్, సట్ల శ్రీనివాస్, మూల భూలోకరెడ్డి, బాలాజీరెడ్డి, నాగెల్లి శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

'రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం'

కేసముద్రం, జనవరి 4 : మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థినులకు హన్మకొండ రోటరీక్లబ్ సహాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం మండలం కల్వల జడ్పీహైస్కూల్లో నలుగురు విద్యార్థినీలకు ఆ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉంటారని, ప్రతీ ఒక్కరు తమకు తోచిన రీతిలో వారికి చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవరెడ్డి, హెచ్ఎం బండారు నరేందర్, క్లబ్ అధ్యక్షుడు ఎ.రవీంద్రానాథ్, ప్రధాన కార్యదర్శి సతీష్, దారం శ్రీనివాస్, చీకటి వెంకట్రాంనర్సయ్య, గొట్టం రోజారాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కొరిపెల్లి వాసి మృతి


మట్టిపల్లి నందు (ఫైల్)

పెద్దవంగర, జనవరి 4 : రోడ్డు ప్రమాదంలో కొరిపెల్లి వాసి మృతి చెందిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్తెనపల్లి గ్రామ శివారులోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. గురువారం గ్రామస్థుల వివరాల ప్రకారం. మండలంలోని కొరిపెల్లి గ్రామానికి మట్టిపల్లి ఉప్పలయ్య ఐలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా, రెండో కుమారుడైన మట్టిపల్లి నందు (22) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం నాడు మట్టిపల్లి నందు అశోక లేలాండ్ గూడ్స్ వాహనంలో బేకరి వస్తువులను తరలిస్తున్న క్రమంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సత్తెనపల్లి గ్రామ శివారులో డివైడర్‌ను ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు తెలిపారు. యువకుడు మృతి చెందడంతో గ్రామస్థులు శోక సంద్రంలో మునిగారు.

వృద్ధురాలు ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 4 : జిల్లా కేంద్రం శివారు అనంతారంలో అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన వృద్ధురాలు రామడుగు అనసూర్య (68) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మహబూబాబాద్ రూరల్ ఏఎస్సై డి.కుమార స్వామి తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. అనంతారానికి చెందిన రామడుగు అనసూర్య గత కొంతకాలంగా ఛాతిలోనొప్పి వస్తుందంటూ బాధపడుతూ ఉండేది. గురువారం తెల్లవారుజామున నొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లోని రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమార్తె శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మండల పాస్టర్ల సంఘం ఎన్నిక

కేసముద్రం, జనవరి 4 : అన్నారంలో గురువారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని మహబూబాబాద్ పాస్టర్స్ అండ్ లేలీడర్స్ జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, ఎండీపీఎల్ఎఫ్ ఫౌండర్ మల్లెపాక తిమోతి సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా అప్పాల పేతురు, ఉపాధ్యక్షుడిగా రిషిక పృథ్వీరాజ్, కార్యదర్శిగా ఎలుక ప్రభుజీవన్, ఉపకార్యదర్శిగా మునిగె జోసెఫ్ సురేష్, కోశాధికారిగా జల్లె ఇశ్రాయేల్, ముఖ్య సలహాదారులుగా బానోత్ విక్టల్‌పాల్, కాలెపాక మహేందర్‌ను ఎన్నుకున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

పర్వతగిరి, జనవరి 4 : మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. గురువారం పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ముంజాలకుంట తండాకు చెందిన మహిళకు ఐదేళ్ల క్రితం కేసముద్రం మండలంలోని కోమటిపల్లి తండాకు చెందిన బాదావత్ మోహన్‌తో వివాహం అయ్యింది. ఇద్దరికి ఒక బాబు జన్మించిన అనంతరం గొడవల కారణంగా విడాకులు తీసుకుని వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో మహిళ హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వెళ్లగా అక్కడ నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లికి చెందిన కణుకుల యాకూబ్‌రెడ్డితో పరిచయం ఏర్పడి చనువుగా ఉండేవారు. అనంతరం వీరిద్దరి మధ్య కూడా గొడవలు జరగడంతో అతడితో మాట్లాడడం మానేసి తల్లిగారి ఊరైన ముంజాలకుంట తండాకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో గత డిసెంబరు 31వ తేదీన యాకూబ్‌రెడ్డి తండాకు వచ్చి ఆమెతో గొడవపడి విచక్షణారహితంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి బాబాయ్ బానోత్ మిట్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్సై వీరభద్రరావు, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీ భర్త మధ్య వివాదం

● వైరల్ అవుతున్న వీడియోలు ● పోలీసులకు పరస్పర ఫిర్యాదులు


కేసముద్రం స్టేషన్‌లో సర్పంచ్, ఎంపీటీసీ భర్త మధ్య వాగ్వావాదం వీడియో

కేసముద్రం, జనవరి 4 : ఇటీవలె కాంగ్రెస్‌లో చేరిన కేసముద్రం స్టేషన్ సర్పంచ్ భట్టు శ్రీను, బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీ ఆగె మంజుల భర్త వెంకన్న మధ్య గురువారం తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకోగా, ఆ వీడియోలు సామాజికమాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. గురువారం మధ్యాహ్నం సర్పంచ్ ఇంటి సమీపంలో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా, వెంకన్న అక్కడికి చేరుకొని నాణ్యత పాటించడంలేదని అడ్డుకొని అక్కడే ఉన్న సర్పంచ్, మిల్లర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడడంతో వాగ్వావాదం జరిగినట్లు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. అంతకు ముందు ఇరువురు ముష్టిఘాతాలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈ వాగ్వావాదం పెట్టుకున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ విషయంపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ జరుపుతున్న ఎస్ఐ వంశీధర్ తెలిపారు. ఈ ఘటన మండలంలో తీవ్ర సంచలనం రేపాయి.

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ రవీందర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నేత

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 : ములుగు జిల్లా కేంద్రంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ బి.రవీందర్‌నాయక్‌ను గురువారం టీఎన్జీవోస్ మానుకోట జిల్లా అధ్యక్షుడు, వైద్యశాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ములుగు జిల్లా కలెక్టరేట్‌లో గురువారం మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరపై ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులతో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రవీందర్‌నాయక్ సమావేశమయ్యేందుకు వచ్చారు. ఈ క్రమంలో టీఎన్జీవోస్ మానుకోట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రవీందర్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

తొర్రూరు, జనవరి 4 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ జి.జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి ప్రవేశాలకు ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11గంటలకు పరీక్ష ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హులైన ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

8న ఐటీఐ కళాశాలలో అప్రెంటిస్‌షిప్ మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4 : మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8న ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని గ్రేడుల అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాకుహాజరయ్యేఅభ్యర్థులు www.apprenticeshipindia. org.in వెబ్‌సైట్‌లో తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత కోర్సుల సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను తీసుకుని ఉదయం 10.30 గంటలకు మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 4 : కోరుకొండపల్లిలో గురువారం లయన్స్‌క్లబ్ పాస్ట్ జడ్‌సీ యర్నం శ్రీరాములు తల్లి నర్సమ్మ జ్ఞాపకార్థం అన్నదానాన్ని చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగెల్లి జ్యోతిశ్రీనివాస్, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కటకం చంద్రశేఖర్, కార్యదర్శి పరాంకుశం శ్రీహరి, మారం సమ్మిరెడ్డి, మడిపెద్ది వెంకటేష్, దాసరి అశోక్, పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎన్నికల హామీలను సమర్థవంతంగా అమలు చేయాలి'


మాట్లాడుతున్న ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, జనవరి 4 : కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ అహంకార పూరిత విధానాల వల్లనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని కుదిస్తూ కూలీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాపాక శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, అవుల కట్టయ్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తా

నెల్లికుదురు, జనవరి 4 : ప్రజాపాలన కార్యక్రమంతో సమస్యలు పరిష్కరించబడుతాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. రాజుల కొత్తపల్లిలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ తూళ్ల సంధ్యరాణి, ఎంపీటీసీ వెల్ది గోవర్ధన్, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో శేషాద్రి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నెల్లికుదురు, జనవరి 4 : ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని డీఈవో రామారావు తెలిపారు. నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి, మునిగలవీడు ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. మునిగలవీడు పాఠశాలలో ఉపాధ్యాయుడు బేతి మధు సమయపాలన పాటించకపోవడంతో ఒకరోజు వేతనం నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీ మందుల శ్రీరాములు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో మహా పడిపూజ

కేసముద్రం, జనవరి 4 : కేసముద్రం శ్రీధర్మశాస్త్ర అయ్యప్పదేవాలయంలో బుధవారం రాత్రి వోలం చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు కన్నెస్వామి అభిరాజ్‌తో కలిసి మహాపడిపూజ నిర్వహించారు. అంతకు ముందు మధ్యాహ్నం అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మర్రి నారాయణరావు, పోలెపల్లి యాకూబ్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, వోలం చంద్రశేఖర్, తరాల సంపత్, ఎల్లగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

'ఉజ్వల భవిష్యత్ కోసం చదవాలి'

పెద్దవంగర, జనవరి 4 : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం క్రమశిక్షణతో చదవాలని పాఠశాల హెచ్ఎం పాకనాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కోట వేంకటేశం తన సొంత ఖర్చులతో ఐదో తరగతి విద్యార్థులకు గురుకుల ఎంట్రన్స్ ఎగ్జామ్ కోసం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు వేముల సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

డోర్నకల్, జనవరి 4 : సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో చలపతిరావు కోరారు. డోర్నకల్ మండలంలో గురువారం హున్యతండ, రాముతండ, గొల్లచర్ల, జోగ్యతండాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ చైతన్య, డోర్నకల్ ఆర్ఐ రామ, ఏపీవో మున్వర్‌బేగ్ పాల్గొన్నారు.

● గూడూరు : గూడూరు మండలంలో గురువారం బ్రహ్మణపల్లి, కోబల్‌తండ, చిన్న ఎల్లాపురం, భూపతిపేట, వెంగంపేట, సీతనాగరం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికార బృందాలు తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రోజారాణి, వ్యవసాయశాఖ అధికారి అల్లె రాకేష్‌లు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు యాకయ్య, కమలశ్రీనివాస్, భవానీవిష్ణు, పూజారమేష్, బాలు, కవితఅశోక్, శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న డోర్నకల్ కాంగ్రెస్ నాయకులు

డోర్నకల్, జనవరి 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైనందున నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నియమించాలని డోర్నకల్ మండలనాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమలు గురువారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఖమ్మం జిల్లా వైరా మండలం పల్లిపాడులో కలిసి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ పదవులను ఇంకా బీఆర్ఎస్ పార్టీ వారే కొనసాగుతున్నారని, వెంటనే ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా వారిని తొలగించి మరొకరికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే కనకయ్యకు ఉపాధ్యాయుల సన్మానం


ఎమ్మెల్యే కనకయ్యను సన్మానిస్తున్న టీఎస్ టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గార్ల, జనవరి 4 : అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ఎన్నికైనకోరం కనకయ్యను టీఎస్ టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై దృష్టిసారించే విధంగా చర్యలు చేపట్టేందుకు కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, బి.వీరునాయక్, భోజ్యానాయక్, శ్రీను, జి.నాగేశ్వరరావు, మోతిలాల్, భాస్కర్, రమేష్, మంగిలాల్, రూప్‌సింగ్, బాప్‌చంద్, పద్మ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం..

మండల కేంద్రంలోని ఇందిరా నగర్‌కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న వల్లపుదాసు జయప్రసాద్ వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కనకయ్య సొంతంగా రూ.10 వేలను బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే విధంగా ప్రభుత్వమే వైద్యఖర్చులు భరిస్తుందని వారికి భరోస కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, యాకుబ్ పాషా, లెనిన్, రాజశేఖర్, వీరస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు చింతపల్లి విద్యార్థిని ఎంపిక

సీరోలు, జనవరి 4 : రాజస్థాన్ రాష్ట్రంలో ఈనెల 7వ తేదీ నుంచి 12 వరకు జరుగు జాతీయస్థాయి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థినీ ఎంపికైనట్లు చింతపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శంకర్ తెలిపారు. సీరోలు మండలం చింతపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినీ వాంకుడోతు మహేశ్వరీని అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో డిసెంబరు 8వ తేదీ నుంచి 10 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మహేశ్వరీ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు అలీ అస్గర్, సలీం, సోమనాథరాజు, లలిత, లావణ్యకుమారి, అనిత, రాధిక, సర్పంచ్ మల్లు యశస్వినీ, ఉప సర్పంచ్ జెర్రిపోతుల రంగన్న, కురవి వైస్ ఎంపీపీ నర్సయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రాజు హర్షం వ్యక్తం చేశారు.

గార్ల పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు

గార్ల, జనవరి 4 : మండల పరిధిలోని తీర్లాపురం తండాకు చెందిన తేజవత్ అమర్‌సింగ్ కనపడడంలేదని అమర్‌సింగ్ భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు గార్ల ఎస్సై నిమ్మతోట జీనిత్ కుమార్ గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. గత రెండురోజుల కిందట అమర్‌సింగ్ మద్యం తాగి భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు దీంతో భార్య ప్రియాంక బంధువుల ఇండ్లుతో పాటు చుట్టుపక్కల గాలించినా ఆచూకి లభ్యం కాకపోవడంతో గార్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మానుకోట చైర్మన్ వరప్రసాద్

గంగారం, జనవరి4 : పూర్తి అటవీ ప్రాంతమైన గంగారంలో పెరిగిన చలి తీవ్రతకు అల్లాడుతున్న నిరుపేదలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా శాఖ చైర్మన్ వరప్రసాదర్ గురువారం ఉచితంగా 50 దుప్పట్లు, 75 దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటుందని తెలిపారు. నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, వైద్యులు ప్రసన్న పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం

తొర్రూరు, జనవరి 4 : మానవ సేవే మాధవ సేవ అని, ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం సేవ చేస్తున్న ఎన్ఆర్ఐ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి దంపతులను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. గురువారం ఎన్ఆర్ఐ, కార్డియాలజిస్టు డాక్టర్ హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీరెడ్డి దంపతులు ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. పదవులు లేనప్పటికీ కోట్లాది రూపాయలు వెచ్చించి పేద ప్రజలకు సేవలు చేశారని, వారి ఆశీస్సులతో నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, కొమురయ్య, సోమ రాజశేఖర్, వెంకటసాయిలు, వెంకటసాయిలు, సోమ సత్తయ్య, అలువాల సోమయ్య, మనోహర్, వెంకన్న పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

తొర్రూరు, జనవరి 4 : హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ మానిటరింగ్ అధికారి రాయిశెట్టి యాకేందర్ అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో కళాజాత నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. ప్రతీ ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపట్ల అవగాహన కలిగిఉండి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సలహాలు, సూచనల కోసం 1097 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా నాట్యమండలి కళాకారులు రమేష్, అర్జున్, కృష్ణంరాజు, ప్రవీణ్, ప్రణయ్, పద్మ, అచ్చమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

పెద్దవంగర, జనవరి 4 : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని మచ్చ సోమయ్య (85), అవుతాపురం గ్రామానికి బెల్లకొండ లచ్చమ్మ (80) మరణించగా, మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శలో కాంగ్రెస్ నాయకులు రంగు మురళి, తోటకురి శ్రీనివాస్, అనపురం శ్రీనివాస్, జానీ, కొమరమల్లు, రవి, రాములు, గోపాల్, వీరేష్, యాకుబ్, సత్తయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ ధ్వంసం


కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని చింపివేసిన దృశ్యం

చిన్నగూడూరు, జనవరి 4 : గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీని ధ్వంసం చేసి, కాలపెట్టారని ఉగ్గంపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గండ్లె భద్రయ్య, భర్తపురం యాకయ్య తెలిపారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్గంపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ల ఫ్లెక్సీని గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేశామన్నారు. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీ చించి, కాల్చి వేశారని తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. వారితో పాటు వెంకట్య, రాంకోటీ, మల్లయ్య, రవి, చిన్ని ఉన్నారు.



WANTED
★ Wanted in Reputed Bar & Restaurent Cooks Waiter Non Veg C mirchi Omlet as partners no investment. Cell : 7680926830, 9502503637
AJW-177695

WANTED HOSPITAL STAFF
★ GNM Nurses, Duty Doctors & OT Assts. Cont : Guardian Hospital, Mulugu 'X' Road, Warangal.
AJW-0332

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ WGL, HNK, నందు గల SHOW ROOMS, HOTELS, HOSPITALS నందు సెక్యూరిటీ గార్డ్సు వెంటనే కావలెను. జీతం : 10,000/- to 15,000/- + ESI, EPF, Cell : 6309922608, 8978459111
AJW-177648

అర్జెంటుగా కావలెను
★ ఎన్నికల సర్వే చేయుటకు వర్కర్స్ (స్త్రీ/పు॥) అర్జెంటుగా కావలెను. ఆసక్తి గల వారు మాత్రమే ఫోన్ చేయగలరు. సంప్ర॥ 7013501822, 8008825470
AJW-154839

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656205
AJV_164615

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (స్త్రీ/పు), సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8గం॥ నుండి 12గం॥ డ్యూటీలు కలవు. జీతం. రూ.12000/- నుండి 16000/-. సంప్ర॥ 8688072125
AJW-177642

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం జీతం 20K ఫోన్:8977639662, 8977639663
AJH-13256

TO-LET
★ 425 Sft. కార్పెట్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ కార్పొరేట్ ఆఫీసులకు, షోరూం, బొటిక్ మరియు జ్యూవలరీ మొదలగు షాపులకు కిరాయికి ఇవ్వబడును. డొమినోస్ పిజ్జా బ్యాక్ సైడ్ శ్రీ సాయి కాలనీ, ఫారెస్ట్ ఆఫీస్ దగ్గర, సుబేదారి, హన్మకొండ. సెల్ : 9866242881, 9985012021
AJW-27386

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. Cont : 9849145043, 9866584455.
AJW-177626

RNR WATER SOLUTIONS
★ RNR Water Solutions, NIT 2nd Gate Opposite, Hanamkonda. Offers a Golden Opportunity to Dynamic & Experienced Sales Executive and Telecallers Male and Female. Contact : 8106376472
AJW-177696

3 నెలల్లో డిప్లమా.B.TECH. LLB
★ 3 నెలల్లో Diploma/B.Tech/LLB/ BL PART TIME. అన్ని Govt Jobs కు Eligible. Exams - FEB - 2024. గ్యారెంటీ పాస్‌కై కృషి. Cell:79953 50670, 95502 71042
AJC-178306

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
8341725534
వరంగల్
9985406505
9985406150
జనగామ
9866431354
మహబూబాబాద్
9849814336
భూపాలపల్లి
9985401232
తొర్రూర్
9985408003
పరకాల
9985411677
నర్సంపేట
9985418040